TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు     తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 242 | గురువారం 08-05-2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# ఆపరేషన్ సిందూర్‌తో ప్రభుత్వం అప్రమత్తం




- సైన్యానికి మనో ధైర్యం ఇచ్చేలా నేడు ర్యాలీ
- అసత్యప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు
- ఆస్పత్రులు, మందుల నిల్వలు, రక్త నిల్వలు సన్నద్ధం చేసుకోండి
- 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్
- ఉద్యోగులు, అధికారులు, మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు
- అధికారులతో అత్యవసర సమావేశంలో ఆదేశించిన సిఎం రేవంత్

'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సైన్యంతో మనమంతా వెన్నంటి ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ జితేందర్,హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

పేజి 2లో

## భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి భారతీయుడిగా గర్వపడుతున్నా : కేసీఆర్



హైదరాబాద్ : భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా తాను గర్వపడుతున్నాని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా.. ఏ దేశంలో వున్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే అని కేసీఆర్ స్పష్టం చేశారు.
ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశరక్షణలో మేమెవరికి తీసిపోము అన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

## భారత సైన్యానికి సెల్యూట్.. జైహింద్ : కేటీఆర్



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మిస్సైళ్లతో మెరుపు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేసిన భారత సైన్యానికి సెల్యూల్ చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. తీవ్రవాద శిబిరాలను పూర్తిగా తుడిచిపెట్టే ప్రక్రియలో వారికి మరింత బలం చేకూరాలి%ొ% ప్రతి ఒక్కరం భారత సైన్యానికి అండగా ఉందాం అని అన్నారు. చివరగా జైహింద్ అని కేటీఆర్ పేర్కొన్నారు.



### భారత్ గతంలో ఎన్నడూ చేయనట్లు..

## 'ఆపరేషన్ సిందూర్'

- భారత్ గతంలో జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ కంటే భిన్నంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. అత్యున్నత స్థాయి టెక్నాలజీని వాడింది.

భారత్ గతంలో జరిపిన మెరుపుదాడుల కంటే తాజాగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' పూర్తిగా భిన్నమైనది. 2016లో ఉరి ఉదంతం తరువాత నిర్వహించిన మెరుపుదాడులు, పేజి 2లో


## మోదీ ఫస్ట్ రియాక్షన్ ఇదే

- ఆపరేషన్ సిందూర్‌తో పాక్ భూభాగంలో మన బలగాలు విజయవంతంగా దాడులు చేపట్టాయి. ఈ పరిణామాలపై మోదీ స్పందించారు.




## ఇండిగో కీలక ప్రకటన..

### 10 వరకు 165 విమాన సర్వీసుల రద్దు



ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇండిగో పలు విమానాలను రద్దు చేసింది. దేశవ్యాప్తంగా పలు ఎయిర్‌పోర్టుల్లోనూ కార్యకలాపాలు నిలిచిపోయాయి.
దిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. 'ఆపరేషన్ సిందూర్ ' పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు పాల్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత గగనతలంలో కొంత మేర కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో ఇప్పటికే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలోనే ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. మే 10వ తేదీ వరకు 165కు పైగా విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పేజి 2లో

## హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన సివిల్ మాక్‌డ్రిల్




భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది.

## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు.. 26 మంది మావోయిస్టులు మృతి




తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి.

# 'ఆపరేషన్ సిందూర్' బ్రీఫింగ్..

## ఎవరీ సోఫియా, వ్యోమికా..?

- భారత్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ఆపరేషన్ సిందూర్' గురించి జరిగిన మీడియా సమావేశంలో ఇద్దరు మహిళా అధికారులు అందరి దృష్టిని ఆకర్షించారు.

పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాక్, పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ బ్రీఫింగ్ ఇచ్చింది. భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళలు దాడుల వివరాలు వెల్లడించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇంత క్లిష్టమైన ఆపరేషన్ గురించి దేశ ప్రజలకు వెల్లడించిన వారిద్దరే.. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

### ఎవరీ కర్నల్ సోఫియా ఖురేషి..?

గుజరాత్‌కు చెందిన సోఫియా .. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమెకు పీస్ కీపర్‌గా అపార అనుభవం ఉంది. పేజి 2లో



# సంపాదకీయం

## పాకిస్థాన్‌కు గుణపాఠం ఎలా

భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ సారి భారతదేశం నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తోందని, పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పి తీరుతుందనే విషయమై స్పష్టమైన సంకేతాలు లభిస్తున్నాయి. దేశ విభజన కాలం నుంచీ పాకిస్థాన్ భారతదేశం పట్ల ఎన్నో దురాగతాలకు పాల్పడింది. మరెన్నోసార్లు భారత్ చేతుల్లో దెబ్బతిన్నది. అయినా ఆ దేశం వైఖరి మారడం లేదు. మత రాజ్యంగా మారడమే పాకిస్థాన్‌కు ప్రాణాంతకంగా మారుతోందా? ఆ దేశ పాలకులు తొలినాటి నుంచీ అనుసరిస్తున్న విధానాలు ఏ గుణపాఠాలు నేర్పుతున్నాయి?

'నీవు కనుక నా స్నేహితుడువి కాకపోతే ఈ పాటికి నేను నిన్ను చంపేసి ఉండేవాడిని..' అని ఒక సాయంత్రం ప్రముఖ ఉర్దూ రచయిత సాదత్ హసన్ మంటోతో ఒక హిందూ మిత్రుడు యధాలాపంగా అన్నాడట. దేశ విభజన సమయంలో భారతదేశంలోనే ఉండిపోవాలని నిర్ణయించిన మంటో ఆ మరుసటి రోజే పాకిస్థాన్ వెళ్లిపోయారు. అక్కడ కూడా పెచ్చరిల్లుతున్న ఉన్మాద పరిస్థితులను, అసహనాన్ని చూసి ఆయన తట్టుకోలేకపోయారు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన సాదత్ హసన్ మంటో ఈ విభజనను ఒక బీభత్స విషాదంగా, రాజకీయ సామాజిక ఉన్మాదంగా అభివర్ణించారు. ఈ అర్థరహిత మతోన్మాదాన్ని ఆయన ప్రతీకగా తీసుకుని 'తోబాటేక్ సింగ్' అనే కథను రచించారు. దేశ విభజన వల్ల జరిగిన దుష్పరిణామాలను వివరిస్తూ ఆర్ఎస్ఎస్ మేధావి రాంమాధవ్ కూడా తన పుస్తకం '%ఉష్ట్రవ ఎఱఅఎబ్ఝు ాఝుతీఝుఎఱఅస్త్రవ%'లో సాదత్ హసన్ మంటో రచనలను ఉటంకించారు. పాకిస్థాన్ ఒక స్వీయ విచ్ఛిన్నకర శక్తిగా మారే పరిణామం గురించి మంటో ఆనాడే ఊహించారు. 'మీరు పాకిస్థాన్‌కు సైనిక సహాయం చేస్తున్నారంటే మా ముల్లాలను సాయుధం చేస్తున్నారన్నమాట' అని ఆయన 1950లలో 'లెటర్స్ టు అంకుల్ శామ్' పేరిట వరుసగా రాసిన వ్యాసాల్లో వ్యాఖ్యానించారు. సంగీతం, కళలు, సాహిత్యం కవిత్వంపై నిషేధం విధించే రోజులు వస్తాయని ఆయన 'అల్లా దయతో' అన్న శీర్షికతో రాసిన వ్యాసంలో ఆనాడే ఊహించారు. 'మా నాన్న ఊహించినట్లే పాకిస్థాన్‌లో అసహనం తీవ్రంగా పెచ్చరిల్లిపోయింది.. ఎందరో ప్రచురణ కర్తలు, జర్నలిస్టులను మతోన్మాదులు హత్య చేశారు..' అని మంటో కుమార్తె నస్రత్ వాపోయారు.

'ఇస్లామిస్టులు వేరు, ముస్లింలు వేరు..' అని ప్రముఖ రచయిత %ఝుతీవఎ ఖీఝుష్ట్ర% లాతారిక్ ఫతే తన '%జష్ట్రుంఱఅస్త్ర ఖ వీఱతీఝుస్త్రవ : ఎష్ట్రవ్ తీఝుస్త్రఱఎ ×శ్రీశ్రీబంఱశీఅ శీట ఖఅ ×ంశ్రీఝుఎఱఎ ర్ఖ్వ%' పుస్తకంలో రాశారు. ఇస్లామిస్టులు మతరాజ్యాన్ని కోరుకుంటే, ముస్లింలు ఆధ్యాత్మికతను కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా వలస పాలనలో కునారిల్లుతున్న పరిస్థితుల్లో ప్రభవించిన పాకిస్థాన్ ముస్లిం ఉదారవాదులకు, వారిలో ఉన్న సూఫీ తత్వానికి, ప్రజాస్వామ్యానికి, బహుళ మతస్తులకు వేదికగా మారుతుందని అనేక మంది కలలు కన్నారు. అయితే విషాదకరంగా ఆ దేశం ఒక మత రాజ్యంగా మారిపోయింది. భారత్ నడిచిన దారిలో సాగలేదు. భవిష్యత్తులో హిందువులు హిందువులుగా, ముస్లింలు ముస్లింలుగా ఉండరని, మతం వారి వ్యక్తిగత విశ్వాసంగానే ఉన్నప్పటికీ వారు ఈ దేశ పౌరులుగా ఉండిపోతారని ప్రకటించిన పాకిస్థాన్ వ్యవస్థాపకుడు జిన్నా ఆ తర్వాత తన మాటలకు కట్టుబడకుండా తన దేశాన్ని మత రాజ్యంగా మార్చారు. దళితుల రాజకీయ హక్కులకోసం పోరాడుతూ జిన్నాకు సన్నిహితుడైన జోగేంద్రనాథ్ మండల్ దేశ విభజన తర్వాత పాకిస్థాన్ తొలి న్యాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1948లో భారత పాక్ యుద్ధం, మత కల్లోలాల తర్వాత ఆయనకు కీలకమైన పైళ్లు ఇవ్వడం నిరాకరించారు. ఇస్లాంను పాకిస్థాన్ అధికార మతంగా ఆ దేశ తొలి ప్రధాని లియాఖత్ అలీఖాన్ ప్రకటించిన తర్వాత మండల్‌పై దూషణలు, దాడులు పెరిగిపోయాయి. 1950 అక్టోబర్‌లో జోగేంద్రనాథ్ మండల్ కలకత్తాకు పారిపోయి రావాల్సి వచ్చింది. పాకిస్థాన్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఆయన తన రాజీనామా లేఖలో ప్రస్తావించారు.

1965లో దేశాధ్యక్ష పదవిని నిలబెట్టుకునేందుకు ఎన్నికలను రిగ్ చేసి గెలిచిన అయూబ్ ఖాన్ తనపై ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు 'ఆపరేషన్ జిబ్రాల్టర్' పేరిట వేలాది పాక్ సైనికులను సివిల్ దుస్తులతో కశ్మీర్‌లోకి పంపారు. ఆపరేషన్ జిబ్రాల్టర్ మాత్రమే కాదు, భారత సరఫరాలను అడ్డుకునేందుకు జమ్మూ%-%కశ్మీర్‌లో అఖ్నూర్ వంతెనను స్వాధీనం చేసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఆపరేషన్ గ్రాండ్ స్లామ్ కూడా విఫలమైంది. అయినప్పటికీ ఆయనను విమర్శించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రించారు. పాకిస్థాన్ సంరక్షకుడుగా సుప్రసిద్ధుడైన అయూబ్ ఖాన్ మరో దశాబ్దం పాటు అధికారంలో కొనసాగగలరని చాలా మంది భావించారు. నాలుగేళ్లలోనే ప్రజాగ్రహం ఆయనకు వ్యతిరేకంగా పెల్లుబుకింది. లక్షమందిని నిర్బంధించినా, వందల మందిని హతమార్చినా ఆయన గద్దె దిగాల్సి వచ్చింది. 50లక్షల మంది కశ్మీరీలకోసం పది కోట్ల మంది పాకిస్థానీయుల ప్రాణాలను పణంగా పెట్టలేమని ఆయన చెంపలేసుకున్నారు.

కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్తాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపుకుంటూనే ఉన్నారు. పాకిస్థాన్‌లో పనిచేసిన అనేకమంది విదేశీ జర్నలిస్టులు ఈ వాస్తవాన్ని తమ వ్యాసాల్లో, పుస్తకాల్లో చిత్రించారు. కశ్మీర్ అనేది పాక్ వ్యూహాత్మక సంస్కృతిపై ఆధిపత్యం చలాయిస్తోందని 'ద టైమ్స్' విలేఖరి అనాటో లెవియన్ తన పుస్తకం 'పాకిస్తాన్%-% ఏ హార్డ్ కంట్రీ'లో వ్యాఖ్యానించారు. ఇదే పాకిస్థాన్‌కు తీరని నష్టం చేసిందని, దీనివల్ల ఆ దేశం పూర్తిగా విచ్ఛిన్నమయ్యే అవకాశాలు లేకపోలేదని ఆయన పదేళ్ల క్రితమే రాశారు. భారతదేశం తమకు శత్రువని, అది పైకి కనపడినంత బలమైన దేశం కాదని, ఆ దేశంలో లుకలుకల్ని తాము ఉపయోగించుకుంటామని పాక్ సైనికాధికారులు తనకు చెప్పినట్లు ఆయన రాశారు. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయని, ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని పోషిస్తున్నాయని కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. 2011లో ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ నేతృత్వంలో శాంతి బృందంలో భాగంగా పాకిస్థాన్‌ను సందర్శించినప్పుడు లాహోర్‌లో ధ్వంసమైన ఒక దేవాలయాన్ని, ముస్లింలు ఆక్రమించిన చరిత్రాత్మక గురుద్వారాను స్వయంగా చూశాను. బహుళమత సంస్కృతిని ధ్వంసం చేసిన పాకిస్థాన్ ఏం సాధించింది?

1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావంతో తన జనాభాలో 54 శాతం కోల్పోయి అవమానాల పాలైనా, 1999లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారలేదు. జియా ఉల్ హఖ్ ఏలుబడిలో పాకిస్థాన్‌కు, ఆ దేశంలోని మదర్సాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించేందుకు సహాయపడిన అమెరికా సెప్టెంబర్ 11 దాడుల తర్వాత తన వైఖరిని మార్చుకుంది. ముషారఫ్‌పై ఒత్తిడి చేసి ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతును తగ్గించేందుకు తోడ్పడింది. అబోటాబాద్‌లో అమెరికన్ దళాలు ఒసామాబిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత పాక్ సైన్యం నైతిక స్థైర్యం కోల్పోయింది. కాబూల్‌లో అమెరికన్ రాయబార కార్యాలయంపై దాడి చేసిన హక్కానీ నెట్‌వర్క్ వెనుక పాక్ సైనికాధికారుల హస్తం ఉన్నదని న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్టు కర్లోట్టా గాల్ తన పుస్తకం 'ద రాంగ్ ఎనిమీ'లో రాశారు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుంటుందని, అంతర్జాతీయంగా విశ్వసనీయతను కోల్పోతోందని ఆమె రాశారు. క్రమంగా ఉగ్రవాదంపై పోరులో పాకిస్థాన్ తన మిత్రపక్షం కాలేదని అమెరికా గ్రహించింది. 2001 నుంచి 2003 మధ్య న్యూఢిల్లీలో అమెరికా రాయబారిగా ఉన్న రాబర్ట్ డి బ్లాక్‌వెల్ భారత్‌కు పూర్తి మద్దతునీయాలని సూచించిన తర్వాత అమెరికా విదేశాంగ విధానంలో మార్పు ప్రారంభమైంది.

1948లో ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత వేలాది ప్రజల ప్రాణాలు పోయినప్పటికీ వేల కోట్ల నిధులు వృధా అయినప్పటికీ నియంత్రణ రేఖ ఒక అంగుళమైనా మారలేదు. పాక్ బడ్జెట్‌లో 30శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు 41 శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానడం లేదు.

'వసుధైక కుటుంబకం' అన్న భావనను ఆదర్శంగా తీసుకునే భారతదేశం మాత్రం ఎప్పుడూ పాకిస్థాన్ దిశన పయనించకపోవడమే ఈ పురానవ దేశ ప్రజల విజయ రహస్యం. భారత ఉపరాష్ట్రపతిగా ఎంపికైన తర్వాత బీజేపీ మాజీ అధ్యక్షుడు వెంకయ్యనాయుడు తన జిల్లాలోని కసుమూరు మస్తాన్ వల్లీ దర్గాకు వెళ్లి ప్రత్యేక

## హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన సివిల్ మాక్‌డ్రిల్

మొదటి పేజీ తరువాయి

భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లో ఆపరేష్ అభ్యాస్ పేరుతో జరుగుతున్న ఈ మాక్ డ్రిల్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహనకు మాక్ డ్రిల్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండు నిమిషాల పాటు సైరన్ మోగింది. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో సైరన్లు మోగాయి. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వివరిస్తున్నారు. నగరంలోని నాలుగు ప్రాంతాలు (నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ) నుంచి కొనసాగుతోన్న మాక్ డ్రిల్స్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మరోవైపు, మాక్ డ్రిల్‌లో భాగంగా ఫైరింగ్ జరిగినట్లుగా శబ్దాలు వినబటం, కొందరు సంఘ విద్రోహ శక్తులు కాల్పులు జరుపుతుండటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే.. అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నట్లుగా దృశ్యాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. డీఆర్‌డీఏ సమీపంలోని ఓ కాలనీలోని 24 అంతస్తుల భవనంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా సురక్షితంగా కాపాడాలనే అంశాన్ని వివరించారు. అక్కడ ఫైరింజన్లను మోహరించారు. మొత్తంగా 12శాఖల అధికారుల సమన్వయంతో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కాల్పుల్లో గాయపడిన వారిని తోటివారి సహాయంతో సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపై అవగాహన కల్పించారు.

మరోవైపు, విశాఖలోని పాత పోస్టాఫీస్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. సైరన్ శబ్దాలతో ఈ మాక్‌డ్రిల్ మొదలైంది.

## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు.. 26 మంది మావోయిస్టులు మృతి

మొదటి పేజీ తరువాయి

చర్ల: తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో కాల్పులు కొనసాగుతున్నాయి.

ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దీన్ని ఏడీజీ వివేకానంద సిన్హా పర్యవేక్షిస్తున్నారు. సీఆర్పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ ఎప్పటికప్పుడు ఆపరేషన్‌పై ఆరా తీస్తున్నారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## 'ఆపరేషన్ సిందూర్' బ్రీఫింగ్..

మొదటి పేజీ తరువాయి


ఐరాసకు చెందిన పీస్ మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విధులు నిర్వర్తించారు. 2016లో పుణెలో జరిగిన 'ఎక్సర్‌సైజ్ 18' పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. అది మల్టీ నేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్. దానిలో 18 దేశాలు పాల్గొన్నాయి. అన్ని దేశాలు ఉన్నప్పటికీ.. ఒక్క భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించడం గమనార్హం. అప్పుడు బలగాలు శాంతి పరిరక్షక కార్యకలాపాలు, మందుపాతర తొలగింపుపై దృష్టిసారించాయి. 1990ల్లో సోఫియా సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కార్ప్స్‌కు చెందిన సీజన్డ్ ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆమె పనితీరును ప్రశంసించారు కూడా.

### వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్..

చిన్నప్పుడే పైలట్ కావాలని కలలు కన్నారు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ . చదువుకునే రోజుల్లో ఎన్‌సీసీలో చేరారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసిన ఆమె.. తన కలకు తగ్గట్టుగా భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. తన కుటుంబం నుంచి భారత భద్రతా బలగాల్లో చేరిన తొలి వ్యక్తి ఆమే కావడం విశేషం. జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అత్యంత సవాలుతో కూడిన ప్రాంతాల్లో చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపారు. పలు రెస్క్యూ ఆపరేషన్లలో పాలుపంచుకొన్నారు.

ఈ రోజు జరిగిన మిలిటరీ బ్రీఫింగ్‌లో కేంద్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. దాడి ఎంతా పక్కాగా చేసిందో.. ఈ బ్రీఫింగ్ విషయంలోనూ అంతే పక్కాగా వ్యవహరించింది. ఇందులో పాల్గొన్న భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి.. కశ్మీరీ పండిట్. ఈ ఆపరేషన్‌ను వ్యూహాత్మక విజయంగా చూడటమే కాకుండా కలిసికట్టుగా చేసిన కృషిగా కేంద్రం చూపాలనుకున్నట్లు వెల్లడవుతోంది. మహిళలు నాయకత్వం వహిస్తారు.. ప్రతీకారం తీర్చుకుంటారని వెల్లడి చేయాలనుకుందని తెలుస్తోంది. పలువురు పర్యాటకులను వారి భార్యల ముందు చంపినదానికి కౌంటర్‌గా ఈ ఇద్దరు మహిళలను ముందు వరుసలో నిలబెట్టారని పలువురు అభివర్ణిస్తున్నారు.

## ఇది సన్నాహక చర్యే.. ఎవరూ భయపడొద్దు: సీవీ ఆనంద్



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సాయంత్రం 4 గంటలకు సైరన్ మోగించినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రజల్లో అప్రమత్తత పెంచడానికి ఇదో సన్నాహక చర్యేనని.. దీనిపై ఎవరూ భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాద్‌లో సివిల్ మాక్‌డ్రిల్ పూర్తయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

"పారిశ్రామిక సైరన్‌లు, పెట్రోల్ వాహనాల సైరన్లు, పోలీస్ సైరన్లు మోగించాం. సైరన్ మోగగానే ఎక్కడి వారు అక్కడే ఉండాలని సూచించాం. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని రకాల సూచనలు ఇచ్చాం. నాలుగు ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగినట్టు సమాచారం అందించాం. అన్ని శాఖల అధికారుల పనితీరు, స్పందన ఎలా ఉందో ఈ మాక్‌డ్రిల్స్ ద్వారా గుర్తించాం. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖ, విద్యుత్, రవాణా, ఇతర శాఖల వారంతా ఆయా ప్రాంతాలకు తరలి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు తరలించడం, మంటల్ని అదుపుచేయడం వంటి చర్యలు చేపట్టారు. ఫైరింజన్లు, అంబులెన్సుల రాకపోకలకు ట్రాఫిక్ పోలీసులు క్లియరెన్స్ ఇచ్చారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రులను కాపాడేందుకు ఆస్పత్రులకు స్ట్రెచర్లపై తరలించారు. ఇదంతా ప్రజల్లో అప్రమత్తత పెంచేందుకు సన్నాహక చర్య మాత్రమేనని తెలియజేస్తున్నాం. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వ శాఖలు ఏ విధంగా భాగస్వామ్యం అవుతాయో మాక్ డ్రిల్ ద్వారా చేశాం. దీంట్లో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. అందరం కూర్చుని సమీక్షించి అధిగమించేందుకు కృషిచేస్తాం. విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు ఎలాంటి సన్నద్ధత అవసరమో వాటిని మెరుగుపరుచుకొనేందుకు చర్యలు తీసుకుంటాం. తప్పుడు వార్తలు నమ్మవద్దని ప్రజల్ని కోరుతున్నాం. ఏ సహాయం కావాలన్నా 112కు ఫోన్ చేయొచ్చు" అని సూచించారు.

## ఆపరేషన్ సిందూర్‌తో ప్రభుత్వం అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి

సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,ఇతర నేతలు పాల్గొననున్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రైవేటు– ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు– సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు– భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ– సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## భారత్ గతంలో ఎన్నడూ చేయనట్లు.. 'ఆపరేషన్ సిందూర్'

మొదటి పేజీ తరువాయి

2019లో బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్స్ సహా గతంలో ఎన్నడూ ఇటువంటి దాడులు చేపట్టలేదు. సాంకేతికపరంగా ఈ ఆపరేషన్ అత్యంత బలమైనది.. ఖర్చుతో కూడుకొన్నది. అంతేకాదు.. ఉగ్రవాదం విషయంలో గతంలో అనుసరించిన వైఖరి పూర్తిగా మారిపోయిందనే బలమైన సంకేతం పాక్‌కు వెళ్లింది.

"భారీ సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చడంతో.. టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌లు, వాటి హ్యాండ్లర్లకు తీవ్ర హెచ్చరికలు వెళ్లినట్లైంది. దీంతోపాటు భారత్ అవసరమైతే ముందస్తుగా దాడి చేయగలదని.. పాక్‌లోని ఏ లక్ష్యం తమకు దూరం కాదని చెప్పినట్లైంది. దీంతోపాటు ఉగ్రదాడులకు ప్రతిస్పందించడమంటే కేవలం శక్తినే చూపబోమని.. టెర్రరిస్టుల కార్యకలాపాలు, ఇతర వనరుల పునాదులను పెకలించేస్తామని ఈ దాడులతో పేర్కొంది.

అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే 24 ఆయుధాలను భారత్ వినియోగించింది. వీటిల్లో క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లు ఉన్నాయి. మొత్తం తొమ్మిది ఉగ్రక్యాంప్‌లను ఏకకాలంలో ధ్వంసం చేశాయి. దాదాపు 70 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. మరో 60 మంది వరకు గాయపడ్డారు.

ఈ దాడి కోసం భారత్ ఇంటెలిజెన్స్ అధికారులు ఉపగ్రహ చిత్రాలను, హ్యూమన్ ఇంటెలిజెన్స్, ఉగ్ర కమ్యూనికేషన్లను విశ్లేషించి.. జైషే మహమ్మద్, లష్కరే వినియోగించే కాంప్లెక్స్‌ను గుర్తించారు. వీటితోపాటు ఆ ఉగ్ర సంస్థల ఆయుధ డిపోలను, బ్రెయిన్ వాషింగ్, స్లీపర్ సెల్ ప్లానింగ్ కేంద్రాలను నిర్ధరించుకొన్నారు. ఇక సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉన్న స్థావరాలపై మానవ రహిత విమానాలతో కొన్ని రోజులుగా నిఘా ఉంచారు.

ఆయుధాల ఎంపికలో కూడా అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించేవాటినే ఎంచుకొన్నారు. స్కాల్ప్ క్రూజ్ మిసైల్, హ్యామర్ గైడెడ్ బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లను ఎంచుకొన్నారు. దాదాపు 25 నిమిషాలపాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో అంతర్జాతీయ సరిహద్దులకు దాదాపు 100 కిలోమీటర్ల దూరంలోని బవహల్పూర్ జైషే క్యాంప్ సహా పలు స్థావరాలను నేల మట్టం చేసింది. ఇక్కడ పాక్ ఆర్మీ రెజిమెంటల్ సెంటర్ కూడా ఉంది. పాకిస్థాన్‌లో అత్యంత శక్తిమంతమైన పంజాబ్ ప్రావిన్స్‌లోనే నాలుగు టెర్రర్ క్యాంప్‌లను నేలమట్టం చేశారు.

## మోదీ ఫస్ట్ రియాక్షన్ ఇదే

మొదటి పేజీ తరువాయి

పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి సంబంధించి బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ స్ట్రైక్స్ గురించి ప్రధాని సభ్యులకు వివరించారు. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ఆయన హర్షం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. భద్రతాబలగాలు చేసిన కచ్చితమై దాడిగా 'ఆపరేషన్ సిందూర్'ను అభివర్ణించారని సమాచారం. పీఓకేలో ఐదు, పాక్‌లో నాలుగు ఉగ్రశిబిరాలను ఎలా లక్ష్యంగా చేసుకున్నారో ప్రధాని వారికి చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారని తెలుస్తోంది. ఈ క్యాబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మోదీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి వీరు సమావేశం అయ్యారు. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

ఇదిలా ఉంటే.. 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సంగతి తెలిసిందే. ఇక, ఉగ్రవాద శిబిరాలపై దాడులను భారత ఉన్నతాధికారులు ప్రపంచ దేశాలకు వివరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్టు అమెరికా, రష్యా, యూకే, సౌదీ అరేబియా, యూఏఈకి సమాచారం అందించారు. మెరుపు దాడులపై వాషింగ్టన్ డీసీలోని భారత ఎంబసీ ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని స్పష్టం చేసింది. ఈమేరకు అమెరికా విదేశాంగ కార్యదర్శితో .. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ మాట్లాడారు.

## ఇండిగో కీలక ప్రకటన..

### 10 వరకు 165 విమాన సర్వీసుల రద్దు

మొదటి పేజీ తరువాయి

"గగనతలంపై ఆంక్షల నేపథ్యంలో అమృత్‌సర్, బికనేర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పుర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి మే 10వ తేదీ ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నాం" అని ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లను చూసుకోవాలని తెలిపింది. ఆయా విమాన ప్రయాణికులు రీషెడ్యూల్ లేదా టికెట్ క్యాన్సిల్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేవని, క్యాన్సిల్ చేసుకుంటే పూర్తి రీఫండ్ కూడా ఇస్తామని పేర్కొంది.

అటు ఎయిర్‌ఇండియా కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. మే 10వ తేదీ ఉదయం వరకు శ్రీనగర్, జమ్మూ, లేహ్, జోధ్‌పుర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్, చండీగఢ్ ఎయిర్‌పోర్టులకు తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు వన్‌టైమ్ రీషెడ్యూల్ ఛార్జీల మినహాయింపు కల్పించింది. లేదా పూర్తి రీఫండ్ ఇస్తామని తెలిపింది. స్పైస్‌జెట్, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ విమనాలు కూడా రద్దయ్యాయి.

18 విమానాశ్రయాలు మూసివేత..

మరోవైపు, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. శ్రీనగర్, లేహ్, అమృత్‌సర్, చండీగఢ్ సహా పలు ఎయిర్‌పోర్టుల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

# మాదకద్రవ్యాల నిరోధానికి కలిసికట్టుగా కృషి

**- సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీ.పీ వెల్లడి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07 :** గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. మత్తు పదార్థాల రవాణాపై నిరంతరం నిఘాను కొనసాగించాలని, ఎలాంటి సమాచారం తెలిసినా పరస్పరం పంచుకుంటూ వీటి నిరోధానికి పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్లాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అధికారులకు పలు సూచనలు చేశారు. యువత ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా అన్ని విద్యా సంస్థలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే లోపు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, మాదక ద్రవ్యాల నిరోధక కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించేలా చూడాలన్నారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల లోపు పాన్ షాపులు, ఇతర దుకాణాలలో



సిగరెట్లు, గుట్కాలు, నికోటిన్ కలిగిన పదార్థాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటుపడితే వారికి డీ అడిక్షన్ సెంటర్లో చేర్పించి, ఆ అలవాటును మానుకునేలా చూడాలన్నారు. మెడికల్ షాపులలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నిషేదిత ఔషధాలను విక్రయించకుండా గట్టి నిఘా ఉంచాలని, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పోలీసు శాఖ ద్వారా కూడా తనిఖీలు జరిపిస్తామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ, ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుండి వివిధ మార్గాల ద్వారా గుట్టుగా ఇక్కడికి తరలిస్తున్నారని అన్నారు. ఎక్కువగా రైలు మార్గం ద్వారా రవాణా చేసే అవకాశాలు ఉన్నందున రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల మూలాలను అడ్డుకోగలిగితే చాలా వరకు వాటి వినియోగాన్ని నియంత్రించవచ్చని అన్నారు.



గంజాయికి ప్రత్యామ్నాయంగా ఓ.పీ.ఎం చాకొలేట్ లు వంటి వాటిని వినియోగిస్తారని, స్థానికంగా వాటిపై నిషేధం ఉన్నందున అలాంటి వాటి విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వల గురించి ఆరా తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మూతపడిన పరిశ్రమలలో బాయిలర్లను వినియోగిస్తూ అల్ప్రాజోలం తయారు చేసే అవకాశాలు ఉన్నందున, అలాంటి ప్రదేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. పోలీస్, ఎక్సయిజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని హితవు పలికారు. గత నెలలో జిల్లాలో ఐదు కిలోల వరకు గంజాయి నిల్వలను, 1.5 కిలోల అల్ప్రాజోలంను పట్టుకోవడం జరిగిందని ఈ సందర్భంగా సీ.పీ వివరించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డీఐఈఓ రవి కుమార్, వ్యవసాయ, విద్య, అటవీ, రవాణా, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07 :** నిజామాబాద్ పట్టణంలోని ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి 15 చెక్కులను దాదాపు 12 లక్షల రూపాయలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోనీ పలు కాలనీల లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయన్నారు. పేదలకు సహాయంగా అండగా. నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నామని, రుణమాఫీ చేసి చూపించామని, రైతు భరోసా అందిస్తున్నామన్నారు.మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకముద్వర నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి దక్కుతుందన్నారు.

# శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి

**- అంగరంగ వైభవంగ అమ్మవారి జయంతి ఉత్సవాలు**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా కిసాన్ గంజ్ ఆర్యవైశ్య పట్టణ సంఘంలో నిర్వహించిన వేడుకలకు ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతేక పూజ కార్యక్రమాలు, అమ్మవారికి నామకరణ,డోలారోహనం,అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్య కుల దైవం అయినా శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు ప్రపంచ వ్యాప్తంగా ఇతరదేశాల్లో ఉన్న ఆర్యవైశ్య సోదరి,సోదరీమణులు జరుపుకోవడం హైందవ జాతి జీవన విధానం,సనాతన హిందూ ధర్మాన్ని రక్షిండమే అవుతుందన్నారు. వాసవి మాత ఆశీర్వాదంతో భారత్ - పాకిస్తాన్ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో దేశం సుభిక్షంగా ఉండాలని,సకాలంలో వర్షాలు కురిసి రైతులకు అధిక పంటలు పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ,సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘ పెద్దలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కీ"శే" చందు మహారాజ్ కు ఘన నివాళులు అర్పించిన TPCC ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్.

మాజీ మంత్రివర్యులు కీ"శే" చందు మహారాజ్ 33 వ వర్ధంతి సందర్భంగా తాండూర్ పట్టణం హైద్రాబాద్ రోడ్ లో గల చందు మహరాజ్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.ప్రజాక్షేత్రంలో అంచెలంచెలుగా ఎదిగి ఈ ప్రాంత రాజకీయ చరిత్రను సృష్టించిన నాయకునికి తనతో ఉన్న అనుబంధాన్ని కార్యకర్తలతో పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో చందు మహారాజ్ కుమారుడు నరేష్ మహారాజ్,మరియు తాండూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల,తట్టేపల్లి సొసైటీ చైర్మన్ లక్ష్మారెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ షుకూర్,మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్,తాండూరు కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ప్రెసిడెంట్ లోంక నర్సిములు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.ం

# మెట్ పల్లి కోరుట్ల పోలీస్ స్టేషన్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ





**- పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి**

**- విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 07 :** ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.బుధవారం మెట్ పల్లి ,కోరుట్ల పోలీస్ స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో 5ఎస్ అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాల ను తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు.పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన ఆక్సిడెంట్ జోన్ లుగా, బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.ఎస్పీ వెంట డిఎస్పి రాములు, సిఐ అనిల్ కుమార్, ఎస్ఐ లు కిరణ్ కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

# భరోసా సెంటర్ ద్వారా బాధిత మహిళలకు రక్షణ భరోసా

**జగిత్యాల (మన వెలుగు) మే 07 :** జిల్లా కేంద్రంలో బాధిత మహిళలు లేదా బాలికలకు వైద్యం,కౌన్సిలింగ్,అన్ని రకాల సేవలు అందించడంతో పాటు వారికీ పోలీస్ అండగా ఉంటుందనే మనోధైర్యం కల్పించడం కోసం ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ ప్రారంభించి సంవత్సర కాలం అవుతున్న సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు,బాలికలకు న్యాయం జరిగేలా కృషి చేస్తునయె. భరోస్తా కేంద్రం ద్వారా సమగ్రమైన సహాయాన్ని అందించడానికి మరియు ఆపదకు లోనైన వారికి పోలీస్ స్టేషన్లకు,ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించడానికి ఏర్పాటు చేయడం జరిగింది. హింస మరియు లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, స్త్రీలు మరల ఇటువంటి వాటి బారిన పడకుండా చూడడమే భరోసా సెంటర్ యొక్క ముఖ్య లక్ష్యం. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళాలకు లేదా



బాలికలకు సంబందించిన కేసు పోలీస్ స్టేషన్ లో నమోదు కాబడిన సమయం నుండి బాధితులకు అండగా ఉంటూ వారి మానసిక పరిస్థితి గురించి తెలుసుకుంటూ వారికి భరోసా కల్పిస్తూ మరియు భరోసా సెంటర్ల గురించి అందరికీ అవగాహన కల్పిస్తున్న భరోసా సెంటర్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ గీత, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ అనూష , సపోర్ట్ అధికారి లు సుజాత ,ప్రతిబా , రిసెప్షనిస్ట్ సునీతా, ఏఎన్ఎమ్ లక్ష్మీ, మహిళా కానిస్టేబుల్ గౌతమి పాల్గొన్నారు

# ఇందల్వాయి మండలం చంద్రయాన్పల్లి శివారులో చిరుత మృతి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07 :**




రోడ్డు ప్రమాదంలో చిరుత మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం చంద్రయాన్పల్లి శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో చిరుత అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఆర్వో రవిమోహన్ భట్ ఘటనాస్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

చిరుత కళేబరాన్ని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. గతంలో ఇదే ప్రాంతంలో చిరుతలు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.

# పేకాట స్థావరంపై సిసిఎస్ పోలీసుల దాడి

**- 26060 రూపాయలు నగదు స్వాదీనం**



**ధర్మపురి (మన వెలుగు) మే 07 :** ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంతపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిసిఎస్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 6గురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 26060 రూపాయలు, 6 మొబైల్ ఫోన్స్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిని ధర్మపురి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేయడం జరిగింది.జిల్లా ఎస్పీ ఆదేశాలతో అక్రమ,అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి,పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్లు సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.కానిస్టేబుల్స్ రమేష్, ఆఫ్రొజ్, కమలాకర్, ఖాసీం పాల్గొన్నారు.

# డీఈవో అశోక్ కు సన్మానం

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07 :** రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల ఎంసీహెచ్ ఆర్డీలో మూడు రోజులపాటు నిర్వహించిన ట్రైనింగ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి పురస్కారం అందుకున్న జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ కుమార్ ను బీసీ ఉపాధ్యాయ సంఘం



ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డీఈవోను సంఘం నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టాల రామకృష్ణ,అసోసియేట్ అధ్యక్షుడు ఎ.మోహన్,గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు,కోశాధికారి రాజు,గౌరవ సలహాదారులు రమణ స్వామి,మాక్లూర్ మండల బీసీటీయూ అధ్యక్షుడు గంగోనె సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి సహనం పేరుతో .ఇన్నాళ్ళు భరించాం

ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించి టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి కండే హరి ప్రసాద్ మాట్లాడుతూ. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారతం కి “ఆపరేషన్ సింధూర్” తో తిరిగి భారత సమాజంలో వీరత్వాన్ని నింపిన త్రివిధ దళాధిపతులకు, వారికి వెన్నంటి నిలబడ్డ ప్రధాని నరెంద్రమోది కృతజ్ఞతలు... మీ వెన్నంటే మేము.పాకిస్తాన్ తీవ్రవాదులు కాశ్మీర్ లో హిందువుల మీద చేసిన దాడి లో భర్తలను చంపి భార్యల సింధూరం తీసేయడం టార్గెట్. అందుకే భారత ఆర్మీ ఈ ఆపరేషన్ కు పెట్టిన పేరు “ఆపరేషన్ సింధూర్”, తొమ్మిది టెర్రరిస్ట్ క్యాంప్ ల పైన మన ఎయిర్ఫోర్స్ దాడి. వారి దేశంలోకి వెళ్ళలేదు. వారి ఆర్మీ ను కవ్వించలేదు.లెవోసి లైన్ ఆఫ్



కంట్రోల్. తో సంబంధం లేదు. ఆకస్మిక దాడి ఇది. ప్రధానమంత్రి నివాసం నుండి నరేంద్ర మోదీ రాత్రంతా పర్యవేక్షిస్తున్న భారత్ ఎయిర్ ఫోర్స్ చేసిన ఈ దాడి లో జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, మరియు ఇతర తొమ్మిది టెర్రరిస్ట్ హెడ్ క్వార్టర్స్ పైన మన ఆర్మీ దాడి. చనిపోయిన వారి సంఖ్య, దాడి వివరాలు 10:0 గంటలకు CCS సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది 80 మంది మరణించినట్లుగా నిర్ధారించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అమంగల్ మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి పార్టీ కౌన్సిల్ నెంబర్ చెక్కల లక్ష్మణ్, అమంగల్ మాజీ కౌన్సిలర్స్ చెన్నకేశవులు , శ్రీకాంత్ సింగ్,దుడ్డు కృష్ణ యాదవ్,గోరటి నరసింహ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, కల్వకుర్తి అసెంబ్లీ బిజెపి పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, ఆమనగల్ బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్, ఆమనగల్లు బీజేవైఎం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, బీసి మోర్చా నాయకులు విష్ణు చారి,శ్రీనివాస్, బిజెపి పార్టీ సీనియర్ లీడర్ బుచ్చయ్య,సక్రు నాయక్, మక్తాల వెంకటయ్య, ఉప్పల నరసింహ,గాజుల మల్లయ్య, బిట్టు రాములు, ప్రవీణ్,సాయిబాబా,మహేష్,మల్లేష్,భరత్, శ్రీను, దేరంగుల పెద్దయ్య, తదితరులు పాల్గోన్నారు

## ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి





- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ,వీరందరూ వారి రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం రోజున తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చౌటుప్పల మండల పరిధిలోని పెద్దకొండూరు, చిన్నకొండూరు గ్రామాలలో ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్న అనంతరం నర్సింహ,సైదులు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆనాడు అనేక పోరాటాలు చేసి సాధించుకుంటే నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పథకాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని అన్నారు.నీడ కోసం టెంట్,తాగడానికి సరిపడా నీళ్లు,మెడికల్ కిట్టు,పనిచేయడానికి పనిముట్లు ఆనాడు ఇస్తే ఈనాటి ఈ బీజేపీ ప్రభుత్వం ఆ మౌలిక వసతులు అన్ని తొలగించిందని విమర్శించారు.కొత్త కొత్త జీవోలు తెచ్చి ఉపాధి హామీ కార్మికులతో చెలగాటమాడుతున్నారని అన్నారు.రెండు పూటలా ఫోటోల

## Citu నిరంతర పోరాటాల ఫలితమే మినీ అంగన్ వాడి టీచర్స్ 306 జీవో విడుదల

- సీఐటీయు ఆధ్వర్యంలో తాండూర్ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ మినీ అంగన్వాడీ టీచర్స్ ను మెయిన్ అంగన్వాడీ టీచర్స్ గా అప్ గ్రేడ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.12 నెలల వేతనాలు (ఏరియర్స్) వెంటనే చెల్లించాలి.



మినీ అంగన్వాడీ టీచర్స్ ను మెయిన్ అంగన్వాడీ టీచర్స్ గా (2024 జనవరిలో) రాష్ట్ర ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసింది. అయితే ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జీవో ఇవ్వలేదు.జీవో రానందున వీరికి పెరిగిన వేతనాలు(ఏరియర్స్)12 నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్ లో పెట్టింది. ఈ సమస్యను పరిష్కరించాలని, అధికారికంగా జీవో ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న 12 నెలల వేతనాలు (ఏరియర్స్) వెంటనే చెల్లించాలని అంగన్వాడీ యూనియన్ సిఐటీయు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించాము. ప్రతినెల అధికారులకు వినతి పత్రాలు అందజేశాము. ప్రాజెక్టు, జిల్లా స్థాయిలో అనేక పోరాటాలు నిర్వహించాము. హైదరాబాద్ డైరెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాలు చేశాము. శాసనసభ్యులకు ఎమ్మెల్యేలకు రాష్ట్ర వ్యాప్తంగా వినతి పత్రాలు అందజేశాము. చలో హైదరాబాద్ లు నిర్వహించాము. మార్చి 4న ప్రజావాణిని ముట్టడి చేశాము.మార్చ్ 17,18 తేదీల్లో రెండు రోజులు 48 గంటల ధర్నా కలెక్టర్ ఆఫీసుల ముందు రాష్ట్ర వ్యాప్తంగా వంటావార్పు చేసి నిరసన తెలియజేయడంతో పాటు కలెక్టర్ ఆఫీసులను దిగ్బంధనం చేశాము.ఈ విధంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరంతరం చేసిన పోరాటాల ఫలితంగానే ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ టీచర్స్ ను మెయిన్ అంగన్వాడీ టీచర్స్ గా అప్ గ్రేడ్ చేస్తూ 306 జీవోను విడుదల చేసింది. పోరాడి విజయం సాధించిన 4 వేల మంది మినీ అంగన్వాడీ టీచర్లకు అభినందనలు. వీరి పోరాటానికి అండగా నిలబడ్డ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అందరికీ ధన్యవాదాలు. అయితే ఈ జీవోలో 12 నెలల పెండింగ్ వేతనాలు(ఏరియర్స్) పైన రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.వీటి పైన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలి. 12 నెలల పెండింగ్ వేతనాలు(ఏరియర్స్) ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని, ఈ పెండింగ్ వేతనాలకు సరిపడా బడ్జెట్ ను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నాం.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

- మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో జాప్యానికి తావులేకుండా చర్యలు
- ధాన్యం నిల్వల కోసం అదనపు గోడౌన్లు గుర్తించాలి
- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశం

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07 :**





రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకోవడంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్నివెంటదివెంట నిర్దేశిత మిల్లులకు తరలించడంతో పాటు, తక్షణమే మిల్లుల వద్ద అన్ లోడింగ్ జరిగేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఆర్మూర్ మండలం పెర్కిట్ శివారులో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, బాల్కొండ మండల కేంద్రంలో, మోపాల్ మండలం వెంచిర్యాలలో పీఏసీఎస్, ఐకేపీ మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులను పలుకరించి, ధాన్యం అమ్మకం విషయంలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. కేంద్రాలకు ఎప్పుడు ధాన్యం తీసుకువచ్చారు, ఎన్ని రోజులకు తూకం జరిగింది, కేంద్రాల నిర్వాహకులు సహకరిస్తున్నారా, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలతో కూడిన వాహనాలు ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకుని నిలువ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉన్న గోడౌన్లను గుర్తించాలని, హమాలీలు, లారీల కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా సరిపడా సంఖ్యలో టార్పాలిన్లు సమకూర్చుకోవాలని అన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇంకనూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నందున కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా జాప్యం జరుగకుండా చూడాలన్నారు. రైతులు ఇబ్బందులకు గురికాకూడదని, నిర్ణీత గడువు లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా ఈసారి పెద్ద మొత్తంలో ధాన్యం దిగుమతులు కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున వెంటదివెంట ధాన్యం సేకరణ జరుపుతూ, మిల్లుల వద్ద అన్ లోడింగ్ లో జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఐకేపీ డీపీఎం సాయిలు, స్థానిక అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## రొడ్డ అంజయ్య 3వ వర్ధంతి సందర్భంగా సదస్సును జయప్రదం చేయండి





- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ పిలుపు

జనసముద్రం న్యూస్ చౌటుప్పల్:-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు,అనేక కూలీ,భూ పోరాటాలు నడిపిన అమలజీవి అమరజీవి కామ్రేడ్ రొడ్డ అంజయ్య 3వ వర్ధంతి సందర్భంగా “ ఈనెల 12వ తేదీన చౌటుప్పల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు.బుధవారం రోజున చౌటుప్పల్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో మండల అధ్యక్షులు గంగాదేవి సైదులు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ నేటికీ అనేక మంది వ్యవసాయ కూలీలు గ్రామీణ పేదలు సెంట్ భూమి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.చౌటుప్పల్ ప్రాంతంలో సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు నూతన పాస్ బుక్కులు లేకపోవడంతో అనేక రకాలైన ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వము ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్న పేదలందరికీ నూతన పాస్ బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేసినారు.ఇండ్లు,ఇండ్ల స్థలాలు కూడా నేటికీ చాలామందికి లేవని ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇల్లు లేని ప్రతి పేదవారికి రాజకీయాలకతీతంగా ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి నర్సింహ సూచించారు.అమరజీవి కామ్రేడ్ రొడ్డ అంజయ్య వర్ధంతి సందర్భంగా “ భూమి,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ - పాలకుల వైఖరి “ పై సదస్సు నిర్వహిస్తున్నామని,ఈ సదస్సుకు రాష్ట్ర,జిల్లా నాయకత్వము పాల్గొంటున్నారని ఈ సదస్సులో వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి బొజ్జ బాలయ్య,జిల్లా కమిటీ సభ్యులు బొయే యాదయ్య,మానే సాలయ్య,రాపోతు పద్మ,మండల ఉపాధ్యక్షులు మీసాల శ్రీనివాస్,మండల సహాయ కార్యదర్శి చింతల సుదర్శన్,మండల కమిటీ సభ్యులు యాట ముత్యాలు,జంగం అంజయ్య,గువ్వల చంద్రయ్య,కొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07**

అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం సీతారామరాజు వర్ధంతి సందర్భంగా నగరంలోని కోటగల్లిలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాల వేసి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అల్లూరిది ఒక ప్రతేక అధ్యాయమన్నారు. అల్లూరి సీతారామరాజు పోరాటాలకు గుర్తుగా 125వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో 30 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు,కార్పొరేటర్లు,నాయకులు,కార్యకర్తలు

## అల్లూరి సీతారామరాజుకు టీయూసీఐ విప్లవ నివాళి



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 07 :**

మన్యం వీరుడు, స్వాతంత్ర్యోద్యమ గెరిల్లా పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసిఐ)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లిలో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మట్టి లాంటి మనుషులను మర ఫిరంగులుగా చేసి బ్రిటిష్ సామ్రాజ్యవాధాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు కామ్రేడ్ అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అటవీ భూములపై ఆదివాసీలకే హక్కులు ఉండాలని విదేశీ, పరాయి పెత్తనాలను ధిక్కరించిన ధీశాలి అని అన్నారు. ఆదివాసీ, గిరిజనుల హక్కులను కాలరాస్తున్న నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అల్లూరి స్ఫూర్తితో ప్రతిఘటించాలన్నారు. అడవులపై ఆదివాసులు, గిరిజనులకే హక్కులు ఉండాలని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. దోపిడీ పీడనలు లేని సమసమాజం కోసం, మతోన్మాదానికి, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే అల్లూరికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం వెంకన్న డి రాజేశ్వర్ జిల్లా నాయకులు లింగం లక్ష్మణ్ రాజేశ్వర్ లక్ష్మీనారాయణ, గంగాధర్ అన్వర్ మల్లేష్ మోహన్ దేవిదాస్ విశ్వనాథ్ ధర్మపురి,రమేష్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.




# వినోదాత్మక చిత్రం సింగిల్

## నవ్వించడం కష్టమన్న నటి కేతిక శర్మ

'ఆద్యంతం వినోదంతో నిండిన సినిమా 'సింగిల్'. ఈ చిత్రం చూస్తున్నంత సేపు మనస్ఫూర్తిగా నవ్వుకుంటూనే ఉంటారని అంటోంది నటి కేతిక శర్మ. శ్రీవిష్ణు జంటగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ రాజు తెరకెక్కించారు. ఇవానా మరో కథానాయిక. ఈ సినిమా ఈనెల 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో కేతికహైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో చేయాలని ఎప్పటి నుంచో నా కోరిక. అది ఈ సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉంది. నేను ఈ కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నా. ఇది పూర్తిగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ముస్తాబైంది. దీంట్లో ప్రేమకథ కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నేను పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. తను చాలా ప్రాక్టికల్‌గా ఉండే అమ్మాయి. ఈ కథలో ఎమోషన్ తన పాత్ర ద్వారానే వస్తుంది. ఈ పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుందని తెలిపింది. ఈ చిత్ర విషయంలో కామెడీ నాకు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే వినోదం పండించడం అంత తేలికేం కాదు. అందులోనూ కామెడీ టైమింగ్ విషయంలో శ్రీవిష్ణును మ్యాచ్ చేయడం మరింత కష్టం. ఈ సినిమాలో ఇంటర్వెల్ ఎపిసోడ్ చాలా సవాల్‌గా అనిపించింది. ప్రేక్షకులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకునేలా కార్తీక్ ఈ చిత్రాన్ని రూపొందించారని చెప్పింది. రాబిన్‌హుడ్'లోని నా ప్రత్యేక గీతం 'అదిదా సర్‌ప్రైజ్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషాన్నిచ్చింది. అయితే ఆ పాట విషయంలో తలెత్తిన వివాదం నుంచి ఓ విషయం నేర్చుకున్నా. భవిష్యత్తుల్లో అలాంటి పాటలు చేసేటప్పుడు స్టెప్పుల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నేను హిందీలో ఓ సినిమా చేస్తున్నా. అలాగే తమిళ తెలుగు ద్విభాషా చిత్రం ఒకటి చేస్తున్నా. మరికొన్ని సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. వాటి వివరాల్ని త్వరలో ప్రకటిస్తారని కేతిక తెలిపింది.

# నా మనసు చెప్పిందే చేస్తుంటా!

"ఏదైనా ఓ పెద్ద ప్రయత్నం చేయాలన్నప్పుడు సాహసాలకి సిద్ధం కావల్సిందే. నటిగా కొనసాగితే నాకు సురక్షితమైన ప్రయాణం ఉంటుంది. కానీ కొత్త కథలు చెప్పాలి... చెప్పేందుకు అందరికీ అవకాశం ఇవ్వాలనే ఆలోచన ఎప్పట్నుంచో ఉంది. అందుకోసమే సాహసమైన నిర్ణయం తీసుకుని నిర్మాతగా మారాను" అన్నారు అగ్ర కథానాయిక సమంత . నటిగా తనదైన ముద్ర వేసిన ఆమె... నిర్మాణంలోకీ అడుగుపెట్టారు. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై తొలి ప్రయత్నంగా 'శుభం' చిత్రాన్ని నిర్మించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సమంత మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.



**నిర్మాణంలోకి అడుగు పెట్టాలనే ఆలోచన ఎప్పుడొచ్చింది?**

నటిగా ప్రయాణం చేస్తున్నప్పుడే.. ఈ రంగంలో ఇది కాకుండా ఇంకా ఏదో చేయాలని నా మనసు చెబుతూ ఉండేది. కానీ వరుస సినిమాలతో సమయం దొరికేది కాదు. ఉన్నట్టుండి నేను అనారోగ్యానికి గురయ్యాక ఓ పెద్ద విరామం వచ్చింది. ఇక సినిమాల్లో నటిస్తానో లేదో కూడా అర్థం కాలేదు. అప్పుడే ఒకవేళ నేను నటించకపోతే, సినిమాలు నిర్మించవచ్చు కదా అనిపించింది. పదిహేనేళ్లుగా ఈ రంగంలో నాకు అనుభవం ఉంది. అందుకే ఎలాంటి హడావుడి లేకుండా సినిమాని ప్రారంభించా. పూర్తి చేశాకే ఈ విషయం అందరికీ చెప్పాను.

**అసలు 'శుభం' కథేమిటి? మీ నిర్మాణ సంస్థకి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అని నామకరణం చేయడానికి కారణం?**

నా చిన్నప్పుడు 'బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్... ట్రాలాలా' అంటూ ఓ పద్యం పాడుకునేవాళ్లం. అది గుర్తొచ్చే నిర్మాణ సంస్థకి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అని పెట్టా. ఇక ఇందులో నిర్మించిన తొలి సినిమా 'శుభం' కథ విషయానికొస్తే... ఈ కథంతా కూడా ధారావాహికతో ముడిపడి ఉంటుంది. ధారావాహికలకి శుభం కార్డు ఎప్పుడు పడుతుందా అని మనమంతా ఎదురు చూస్తుంటాం. ఈ సినిమా కథకీ, ధారావాహికకీ సంబంధం ఏమిటన్నది సినిమా చూస్తే అర్థం అవుతుంది.

**మీరు అనుకుంటే పేరున్న తారలతో సినిమాలు చేయొచ్చు. కానీ తొలి సినిమాని కొత్తవాళ్లతోనే చేయడానికి కారణం**

నటిగా నాకు తొలి అవకాశాన్ని దర్శకుడు గౌతమ్ మేనన్ ఇచ్చారు. ఆయన అనుకుంటే ఆ సమయంలో టాప్ హీరోయిన్లు ఎవరైనా నటించేవారు. కానీ కొత్త అమ్మాయినైన నాకు అవకాశం ఇచ్చారు. అలా కొత్తవాళ్లని ప్రోత్సహించాలనేదే నా లక్ష్యం. ఇందులో నటించినవాళ్లని చూస్తున్నప్పుడు నాకు నా పాత రోజులు గుర్తొచ్చాయి. శ్రియ, శ్రావణి, షాలిని... ఇలా ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం కష్టపడ్డారు. సామాజిక మాధ్యమాలు చూస్తే ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారని అర్థమవుతోంది. వాళ్లకు తగిన అవకాశం దొరికితే అద్భుతాలు జరుగుతాయని నా నమ్మకం. నటిగా కొనసాగుతున్నప్పుడు నేను నిర్మాతల కథానాయికని అనుకునేదాన్ని. ఈ సినిమా ప్రయాణం తర్వాత నిర్మాతల కష్టాలు నాకు కొన్నే అర్థమైనట్టు అనిపించింది. ఒక్క రోజు ఒక్క సన్నివేశం అనుకున్నట్టుగా జరగకపోతే ఎంత సమయం, డబ్బు వృథా అవుతుందో ఇప్పుడు ఇంకా బాగా అర్థమైంది.

**ఇందులో మీరు అతిథి పాత్రలో సందడి చేయబోతున్నారు కదా.. ఆ పాత్ర సంగతులేమిటి**

కొంచెం కీలకమైన పాత్రే. మొదట ఆ పాత్రని నేను చేయాలనుకోలేదు. కానీ ఓ నిర్మాతగా నేను వేరొకరి దగ్గరకు వెళ్లి సాయం కోరాలనిపించలేదు. అందుకే ఆ పాత్రని నేనే చేశా. మే 9 విడుదలకు మంచి రోజు. వేసవి కావడంతో కుటుంబమంతా కలిసి థియేటర్‌కి వచ్చేందుకు వీలుంటుంది. అనుకోకుండానే మంచి సమయానికి మా సినిమా విడుదలవుతోంది. నటిగా ఓ శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవమే. నిర్మాతగా ఇప్పుడు నా సినిమా కోసం ఎదురు చూస్తుంటే ఇదివరకటికంటే భయంగా, ఆత్రుతగా ఉంది. కానీ 'శుభం'పై నాకు పూర్తి నమ్మకం ఉంది.

**పెద్ద నిర్మాణ సంస్థలు కూడా ఆచితూచి అడుగులేస్తున్నాయి. ఈ దశలో మీరు నిర్మాణంలోకి అడుగు పెట్టడంపై సరైన నిర్ణయమే అనిపించిందా**

చిత్ర పరిశ్రమలో చాలామంది 'ఇప్పుడు నిర్మాణంలోకి ఎందుకమ్మా..' అన్నారు (నవ్వుతూ). ప్రేక్షకుల్ని థియేటర్‌కి తీసుకురావడం ఇప్పుడు నిజంగా చాలా కష్టమైన పని. కానీ నేను కంటెంట్‌ని బలంగా నమ్ముతాను. స్టార్‌ల తరహాలోనే మంచి కంటెంట్ కూడా ప్రేక్షకుడిని థియేటర్‌కి తీసుకొస్తుందని నమ్ముతాను. ఆ నమ్మకమే నన్ను ముందుకు నడిపించింది. నేను ఓ నటిగా తీసుకునే నిర్ణయాల్లోనూ, వ్యాపారం పరంగా తీసుకునే నిర్ణయాల్లోనూ నా హృదయాన్నే అనుసరిస్తాను. అది ఏం చెబితే అదే చేస్తాను. నిర్మాతగా నాకు భవిష్యత్తు ఉంటుందో లేదో నా తొలి సినిమా తర్వాత తెలుస్తుంది (నవ్వుతూ). మంచి కథలు చెప్పాలన్నదే నా ప్రయత్నం.

**నటిగా మీరు తీసుకున్న ఈ విరామంలో మీకు కొత్తగా అర్థమైన విషయాలు ఏమైనా ఉన్నాయా? మీరు చేయనున్న కొత్త సినిమాల సంగతులేమిటి?**

మళ్లీ నా వ్యక్తిగతం గురించి జీవితంలో మాట్లాడను. అదొక్కటి మాత్రం బాగా అర్థమైంది (నవ్వుతూ). ఇక నా సినిమాల విషయానికొస్తే 'శుభం' విడుదలైన తర్వాత నా నిర్మాణ సంస్థలోనే రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని సెట్స్‌పైకి తీసుకెళు తున్నా. అట్లీ దర్శకత్వంలో నేను నటిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది కానీ, అందులో నిజం లేదు. అట్లీ నాకు మంచి స్నేహితుడు. మేం భవిష్యత్తులో ఏదైనా చేస్తాం కానీ, ప్రస్తుతానికైతే లేదు.



# రాణి అహల్యాబాయి జీవిత చరిత్ర

ఇప్పటికే ఎంతోమంది ధీరుల బయోపిక్‌లు ప్రేక్షకులను ఆకట్టుకున్న క్రమంలో తాజాగా మరాఠి రాణి అహల్యా బాయి హోల్కర్ జీవితం తెరకెక్కనుంది. ఆమె జీవితగాథ ఆధారంగా సినిమా తీయనున్నట్లు- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. రాణి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతటా కొన్ని ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుట్టింది. అలానే ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తి అని అందుకే సినిమాగా ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నట్లు- సీఎం తెలిపారు. దీనిపై ఇప్పటికే చర్చలు ప్రారంభమైనట్లు వెల్లడించారు. మరాఠీతో పాటు ఇతర భాషల్లోనూ ఈ సినిమా విడుదల చేయనున్నట్లు చెప్పారు. దూరదర్శన్, ఇతర ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోనూ రాణి అహల్యా బాయి హోల్కర్ బయోపిక్ అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు.ఇటీవలే మరాఠా యోధుడు శంభాజీ మహారాజ్ వీరగాథ 'ఛావా' ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలైన అన్ని భాషల్లోనూ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్న 'ఛావా' ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటు-లో ఉంది.

# తెలుగు వెబ్ సీరిస్‌లోకి కోవై సరళ

లేడీ కమెడియన్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే పేరు కోవై సరళ. అప్పట్లో ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగింది. ముఖ్యంగా బ్రహ్మానందం, కోవై సరళ జోడికి ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉండేవారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి, తనదైన బాషతో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ తో దాదాపు రెండు దశాబ్దాల పాటు కోవై సరళ అందరినీ మెప్పించింది. అయితే కారణాలు ఏవైనా ఆమె కొంతకాలంగా తెలుగు సినిమాలకు దూరమైంది. తెలుగు అని కాదు తమిళంలో కూడా అడపాదడపా సినిమాలు చేస్తోంది. అలా తెలుగులో డబ్ అయ్యి వచ్చిన సినిమాలను మాత్రమే తెలుగు వాళ్ళు చూసి ఆనందించాల్సిన వస్తుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు కోవై సరళ ఓ తెలుగు వెబ్ సీరిస్ లో ఎంట్రీ ఇస్తోందట. యంగ్ హీరోయిన్ రీతూ వర్మ, శివ కందుకూరి జంటగా నటిస్తున్న వెబ్ సీరిస్ 'దేవిక అండ్ దానీ'. ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇటీవలే రిలీజ్ అయింది. రీతూవర్మ కు ఇదే మొదటి వెబ్ సీరిస్. 'శ్రీకారం' మూవీ ఫేమ్ బి. కిశోర్ ఈ వెబ్ సీరిస్ ను డైరెక్ట్ చేశాడు. అతనితోపాటు- ఇందులో సూర్య వశిష్ఠ, సుబ్బరాజు, మౌనికా రెడ్డి, సోనియా సింగ్, చాగంటి సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# బాలీవుడ్ టుడు అమీర్‌తో అల్లు అర్జున్ భేటీ

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌ను అల్లు అర్జున్ కలిశారు. ముంబయిలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ ఆయనతో కలిసి కొంత సమయం ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతుండగా.. అభిమానులు వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందేమోనని ఆశిస్తున్నారు. ఇటీవల ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం' గురించి తెలిపారు. అందులో అగ్ర కథానాయకులు భాగం కానున్నట్లు- చెప్పారు. దీంతో బన్నీ ఈ ప్రాజెక్ట్‌లో నటించనున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ- సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇందులో ఆయన ద్విపాత్రాభినయంలో నటించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీనికోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్‌ఎక్స్ సంస్థను ఇటీ-వల సంప్రదించారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు- తెలిపారు.



# ఓటిటిలోకి వచ్చేస్తున్న నితిన్ రాబిన్‌హుడ్




'సంక్రాంతి వస్తున్నాం', తదితర చిత్రాలను ఒకే సమయంలో అటు- ఛానల్‌లో, ఇటు- ఓటీటీలోకి తీసుకొచ్చింది 'జీ 5' సంస్థ. ఇప్పుడు 'రాబిన్‌హుడ్' విషయంలోనూ అదే ఫాలో అవుతోంది. మే 10న సాయంత్రం 6 గంటలకు ఈ సినిమా 'జీ తెలుగు' ఛానల్‌లో ప్రసారం కానుందని సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల తెరకెక్కించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. మార్చి 28న థియేటర్లలో విడుదలైందీ సినిమా. రామ్ అలియాస్ రాబిన్‌హుడ్ (నితిన్) ఎవరూ లేని అనాథ. తనలాంటి తోటి పిల్లలతో కలిసి ఓ అనాథ శరణాలయంలో ఆశ్రయం పొందుతుంటాడు. ఆకలి, అవసరాల కోసం నేరాలబాట పట్టిన రామ్.. తెలివిగా చోరీలు చేస్తూ అనాథ శరణాలయాలకు అండగా నిలుస్తుంటాడు. పెరిగి పెద్దయ్యాక కూడా అదే బాటలో అతడి ప్రయాణం కొనసాగుతుంది. బంగారం చోరీ కేసులో ఐపీఎస్ అధికారి విక్టర్ వర్ఘీస్ (షైన్ టామ్ చాకో) చేతికి చిక్కినట్లే చిక్కి త్రుటిలో తప్పించుకున్న రామ్, కొన్నాళ్ల తర్వాత నేరాలబాట వీడి ఉద్యోగం చేయాలనుకుంటాడు. అలా జాన్ సున్నిపెంట అలియాస్ జాన్ స్నో (రాజేంద్రప్రసాద్) నడుపుతున్న ఇండియాస్ నంబర్‌వన్ సెక్యూరిటీ- ఏజెన్సీలో చేరి, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన నీరా వాసుదేవ్ (శ్రీలీ) రక్షణ బాధ్యతల కోసం రంగంలోకి దిగుతాడు. అసలు ఎవరీ నీరా వాసుదేవ్? ఆమె ఇండియాకి ఎందుకొచ్చింది?అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తున్న డ్రగ్ మాఫియా ఆమెని ఎందుకు టార్గెట్ చేసింది?అపాయంలోఉన్న నీరా వాసుదేవ్‌కి రామ్ రక్షణ కల్పించాడా లేదా?అనేది మిగతా కథ.